పాలకుర్తి వాణి
మన పల్లె.. మన ముచ్చట్లు




40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత 2

సంపుటి : 01 | సంచిక : 294 | వరంగల్ | శుక్రవారం, 28 ఆగస్టు 2026 | పేజీలు : 02

# మహిళా సంఘాలే మాదకద్రవ్య రహిత సమాజానికి 'సంఘమిత్రలు'

- వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత
- జనగామను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, పాలకుర్తి వాణి :** మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి మహిళ తన కుటుంబంతో పాటు గ్రామాలను, పట్టణాలను కూడా మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడే "సంఘమిత్ర"గా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు "సంఘమిత్ర - మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు"ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. Cp మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాయని, గర్భిణీలకు పోషకాహారం అందించడం నుంచి చిన్నారులకు మధ్యాహ్న భోజనం, అక్షరాస్యత, కుటుంబ సంక్షేమం, సామాజిక ఆడిట్ వంటి అనేక కార్యక్రమాల్లో మహిళలు ముందుండి పనిచేస్తున్నారన్నారు. జనగామ జిల్లాలో మహిళల చైతన్యం ప్రత్యేకమని పేర్కొంటూ, ఆ చైతన్యాన్ని సమాజ భద్రత కోసం వినియోగించాలని కోరారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 26 లక్షల జనాభాకు కేవలం 3 వేల మంది పోలీసు సిబ్బంది మాత్రమే ఉన్నారని, అందువల్ల మహిళా సంఘాల సహకారం అత్యంత అవసరమని వివరించారు. ఈ సదస్సులో సైకాలజిస్ట్ డా. విజయక్రాంతి మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలు, చికిత్స, పునరావాసంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.






WANTED
విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745






# బడి బాగుకు దాత నరేష్ ఆర్థిక చేయూత

- **రూ.70 వేలతో అభివృద్ధి పనులు, డ్యూయల్ డెస్క్ బల్లాలు**
- **ఎంఈవోతో సర్కారు బడిలో లాంఛనంగా బల్లాల ప్రారంభం**



**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** ప్రభుత్వ బడుల బాగుకు ఓ దాత ముందుకు వచ్చారు. బడిలో విద్యార్థులు పెరుగుతున్న సంఖ్యను గమనించిన ఆయన.. వెంటనే బడి అభివృద్ధికి సంకల్పించు కున్నారు. తనకొచ్చిన ఆలోచనలతో ఏకంగా బడి రూపురేఖలే మార్చేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు సైతం ఆయన చేసిన పనికి జేజేలు పలికారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు మనసున్న దాతలు ముందుకు రావడం మరో విశేషం.

**నరేష్ స్ఫూర్తితో ముందుకొస్తున్న దాతలు**

వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని తిరుమలగిరి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి, బాగుకు దాత కూటికంటి నరేష్ గౌడ్ ముందుకు వచ్చారు. సొంతంగా సుమారు రూ.70 వేల తో 10 అత్యాధునిక డ్యూయల్ డెస్క్ బల్లాలు, అలాగే తరగతి గదులు, తలుపులు, కిటికీలకు రంగులు వేయించారు. నాలుగైదేళ్ల కిందట బడి అంతరించిపోయే దశలో ఉండేదని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య ఏకంగా 25 వరకు ఉందని ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాజ్ కుమార్ తెలిపారు. దాత నరేష్ ముందుకు రావడం సంతోషకరమన్నారు. రానున్న రోజుల్లో ఈ బడి విద్యార్థుల సంఖ్య మరింత పెరిగి అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. నరేష్ స్ఫూర్తితో మరికొందరు దాతలు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. తలో కొంతమేర ఆర్థిక సాయం ప్రకటించారు.

**తిరుమలగిరి బడికి అదనపు సౌకర్యాలు**

కాలక్రమేణ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలకు అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మండల విద్యాధికారి పోతుగంటి నరసయ్య తెలిపారు. దాత నరేష్ సమకూర్చిన బల్లాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి ఆయన మాట్లాడారు. ఒక ప్రత్యేక పథకంలో పాఠశాలకు మరో నాలుగు కంప్యూటర్లు త్వరలోనే అందజేస్తామన్నారు. అలాగే బల్లాలను మరికొన్ని సైతం త్వరలోనే ఇస్తామన్నారు. ఈ బడిని చూస్తే తనకు ఎంతో సంతోషంగా ఉందన్న ఆయన వచ్చే ఏడాదికి విద్యార్థుల సంఖ్య 35కు చేరుకోవాలని కోరారు. ఒక దశలో ఈ స్కూల్ అంతరించిపోయేదని, కానీ గ్రామస్తులు ఉపాధ్యాయులు చొరవతో మళ్లీ జీవం పోసుకుంటుందన్నారు.







## 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు తిరుమలగిరి గ్రామ శివారులో పాలకుర్తిలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్సై పవన్ కుమార్ సిబ్బంది ఆధ్వర్యంలో సుమారు 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మాలోతు మోహన్, భూక్య నామా పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### పీఎం శ్రీ పాఠశాలను తనిఖీ చేసిన

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, పాలకుర్తి వాణి :** గురువారం జిల్లాలోని పాలకుర్తి మండలంలోని పీఎం శ్రీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో నేరుగా మాట్లాడి హిందీ, ఇంగ్లీష్, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం వంటి సబ్జెక్టుల్లో వారి అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. బ్లాక్‌బోర్డుపై గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన అంశాలను స్వయంగా బోధిస్తూ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ.. ఏకరూప దుస్తులు, నోట్ బుక్స్ అందాయా? పాఠ్యాంశాలు ఎంతవరకు పూర్తయ్యాయి? పాఠశాలలో అవసరమైన వసతులు ఉన్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు ప్రతి సబ్జెక్టును సులభంగా అర్థం చేసుకునే విధంగా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు చెస్, వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ అందించాలని పీఈటీని ఆదేశించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో ఉన్న పాత బెంచీలను మరమ్మతులు చేసి అవసరమున్న ఇతర పాఠశాలలకు తరలించాలని, ఒక ప్రత్యేక గదిలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. పాఠశాల భవనాలను పరిశీలించిన కలెక్టర్ తరగతి గదులకు సున్నం వేయించడం, దెబ్బతిన్న కిటికీల మరమ్మతులు, ఫ్యాన్లు లేని గదుల్లో కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాల పాతదిగా ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి, వెంటనే ప్రతిపాదనలు సమర్పిస్తే నిధుల మంజూరును



పరిశీలిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పాఠాలు చెప్పడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, విలువలు, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందించే దిశగా పని చేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, కష్టంగా అనిపించే సబ్జెక్టులపై అదనపు బోధన అందించాలని తెలిపారు. సాంఘిక శాస్త్ర బోధనకు అవసరమైన మ్యాపులను ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేయాలని, కంప్యూటర్ల వినియోగంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచి కోడింగ్ వంటి నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ బోర్డులు వంటి ఆధునిక సాంకేతిక వనరులను పాఠశాలలకు అందుబాటులోకి తెచ్చిందని, వాటిని సమర్థవంతంగా వినియోగించి, గుణాత్మక విద్య అందించాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను తొలగించి ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎంపీడీఓ వేదవతి, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, సర్పంచ్ కె. విజయ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341